www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 25 నవంబర్ 2024 | 5 | ఏలూరు

శ్రీవారి సేవలో డిజిపి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్నను డిజిపి సిహెచ్.ద్వారకాతిరుమలరావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. డిజిపికి ఐజి జిబిజి.అశోక్‌కుమార్, ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్, అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు, ఎస్‌ఐబి అధికారి మల్లేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. డిజిపి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను డిజిపికి అందించారు.



డిజిపికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్‌పి

ఆ వైద్యుల తీరు.. జనం బేజారు..!

జిల్లాలో అర్హత లేకుండానే కొందరు ఆర్‌ఎంపిలు, పిఎంపిలుగా చెలామణి

హంగు, ఆర్భాటంగా క్లినిక్‌లు.. అవసరం లేకున్నా పరీక్షలు

వైద్య ఆరోగ్య శాఖ నిర్లిప్తతపై సర్వత్రా విమర్శలు

'వైద్యో నారాయణో హరి' అన్నారు పెద్దలు.. అంతటి ప్రాముఖ్యత గల వైద్యులు గ్రామాల్లో ఎవరంటే ఠక్కున చెప్పేది ఆర్‌ఎంపిల గురించే. ఆరోగ్యానికి సంబంధించి ఏ చిన్నపాటి సమస్య వచ్చినా వెంటనే వెతికేది మన ఊళ్లోని ఆర్‌ఎంపినే. ఆర్‌ఎంపిలు లేని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే కీలక సమయాల్లో వారు అందించే చికిత్స చాలా కీలకం. అందుకే గ్రామాల్లో ఆర్‌ఎంపిలను జనం తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిగా భావించి తమ సమస్యలన్నీ చెప్పుకుంటారు. అంతటి ప్రాముఖ్యత గల ఆర్‌ఎంపిలకు చెడ్డ పేరు తీసుకొస్తున్నారు కొందరు ఆర్‌ఎంపిలు, పిఎంపిలుగా చెప్పుకునే నకిలీ వైద్యులు.

సీజ్ చేసిన మెడికల్ షాప్

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల జిల్లాలోని పెనుగొండ మండలం సోమరాజుచెరువు గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకున్నా ఓ నకిలీ వైద్యుడు వైద్యం చేస్తున్న విషయం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. అంతకుముందు మొగల్తూరు మండలం కాళీపట్నంలో ఒక పిఎంపి నిర్లక్ష్యం వల్ల ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థత గురైతే సమీప పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రిలో వేలాది రూపాయలు చెల్లించి చికిత్స పొందాల్సి రావడం, దానిపై ఆ బాధితుని కుమార్తె డిఎంహెచ్‌ఒకు ఫిర్యాదు చేయడం కూడా జరిగింది. దీనిపై మొగల్తూరు పోలీసు స్టేషన్‌లో సదరు పిఎంపిపై కేసు సైతం నమోదైంది. అంతకుముందు కొన్నేళ్ల క్రితం నరసాపురంలో అనుమతి లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్న వైద్యుడిని ఆయుష్ తీసుకుని క్లినిక్‌ను మూసివేసిన ఘటన చోటుచేసుకుంది. ఇలా చెప్పుకుంటూ పోతే నకిలీ వైద్యుల లీలలు చాలానే ఉన్నాయి.

ఇదే పరిస్థితి ఇప్పటికీ పలు గ్రామాలతోపాటు పట్టణాల్లోనూ కొనసాగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. నరసాపురం పట్టణంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఇంట్లో మెడికల్ షాప్ వద్ద ఒక డాక్టర్ నాలుగు నుంచి ఆరు వరకు బెడ్‌లు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. పట్టణంలోనే, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పని చేసే కేంద్రంలోనే పలువురు నిబంధనలకు విరుద్ధంగా.. అర్హత లేకుండా వైద్యం చేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు, లేదా ఏదైనా ఫిర్యాదు వస్తేనే స్పందించడం తప్ప నిరంతర నిఘా నకిలీ వైద్యులపై ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో నకిలీ వైద్యులు హల్‌చల్ చేయడం ఈ కాలంలో బాగా పెరిగిందనే చెప్పొచ్చు.

ఆర్‌ఎంపిలు తమ వద్దకు వచ్చే రోగులకు ప్రాథమిక వైద్యం మాత్రం చేయాలి. శరీర వేడి (టెంపరేచర్) ఎంత ఉందో నిర్ధారించాలి. అవసరమైతే పారాసిట్మల్ వంటి ఒకటి, రెండు మాత్రలు ఇచ్చి నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లాలని సూచించాలి. వాస్తవానికి ఆర్‌ఎంపిలు రోగులకు ఇంజక్షన్లు చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయితే ప్రభుత్వాసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి, ప్రయివేటు ఆసుపత్రికి వెళ్తే సొమ్ము కట్టలేని పరిస్థితుల్లో ఆర్‌ఎంపిలను పేదలే ఇంజక్షన్ చేయాలని కోరుతున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. అయితే ఎక్కువ మంది ఆర్‌ఎంపిలు తమ వృత్తిని సేవాదృక్పథంతోనే సాగిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు గ్రామాల్లో సేవలందిస్తున్నారు. ఎవరి వద్దనైనా సొమ్ము లేకపోయినా ముందు చికిత్స అందించి తర్వాత డబ్బు ఉన్నప్పుడు తీసుకునే ఆర్‌ఎంపిలు కూడా గ్రామాల్లో ఎక్కువే. అందుకే ఆర్‌ఎంపిలు లేని గ్రామాలను ఊహించలేమని అంటుంటారు. అయితే ఇదే సందర్భంలో కొంతమంది ఆర్‌ఎంపిలు, పిఎంపిలు మాత్రం సంపాదనే ధ్యేయంగా పేదలను పీల్చి పిప్పి చేస్తున్నారు. అవసరం లేకపోయినా సెలైన్ పెట్టడం, ఇంజెక్షన్‌లు చేయడం వంటివి చేస్తున్నారు. మరికొన్ని చోట్ల అవసరం లేకపోయినా, అర్హత లేకపోయినా పరీక్షలు సైతం చేయిస్తున్నారు. మండల కేంద్రాలు, పట్టణాల్లో కొన్ని క్లినిక్‌ల్లో అయితే ఎటువంటి అనుమతి, అర్హత లేకుండా ఆపరేషన్లు సైతం చేయడం ఆందోళన కల్గిస్తోంది. ఈ నకిలీ వైద్యులే మెడికల్ దుకాణాలు సైతం నిర్వహిస్తుండడం విశేషం. ఒక్కో ఇంజక్షన్‌కు రూ.వంద, సెలైన్ పెడితే రూ.500 వరకూ వసూలు చేస్తున్నారు. ఆర్‌ఎంపిగా కొనసాగాలంటే తప్పనిసరిగా శిక్షణ పొంది ప్రాక్టీస్ చేయడానికి అనుమతిపత్రం పొంది ఉండాలి. అయితే అందుకు విరుద్ధంగా ఎటువంటి శిక్షణ, సర్టిఫికెట్ లేకుండా యథేచ్ఛగా ప్రయివేటు క్లినిక్‌లు నడుపుతుండడం గమనార్హం. మరోవైపు సంపాదనే ధ్యేయంగా మారిన కొందరు ఆర్‌ఎంపిలు, పిఎంపిలు పట్టణాల్లోని బడా ఆస్పత్రులతో సంబంధాలు పెట్టుకుని ఏజెంట్లుగా వ్యవహరిస్తూ భారీగా కమీషన్లు దండుకుంటున్నారు. ఇదంతా ఎటువంటి అర్హత, అనుమతి లేని నకిలీలు సాగిస్తున్న నిర్వాకాలు. ఎవరికైనా వైద్యం వికటించి రోగులకు ప్రాణహాని జరిగినప్పుడు మాత్రమే పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హడావుడీ చేస్తుంటారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని చెబుతారుగానీ తర్వాత ఎటువంటి చర్యలూ కానరాని పరిస్థితి. ఇంత జరుగుతున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు ప్రయివేటు క్లినిక్‌లపై దాడులు చేస్తున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నకిలీ వైద్యులపై చర్యలు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులు నడుపుతున్న మందుల దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నరసాపురంలో నడుస్తున్న అనుమతి లేని ఆసుపత్రి

ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

మహేశ్వరరావు, డిఎంహెచ్ఒ

నకిలీ వైద్యులపై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికి ప్రభుత్వ వైద్యుల ద్వారా జిల్లాలోని ఆర్‌ఎంపి, పిఎంపిల వివరాలను సేకరిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేసి నకిలీ వైద్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

సదస్సులో అభివాదం చేస్తున్న నేతలు

పెంచిన విదుత్ ఛార్జీలను ఉపసంహరించాల్సిందే

వామపక్షాల జిల్లా సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని వామపక్షాల జిల్లా సదస్సు పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సుకు సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఐ నగర కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తలు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు తలారి ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కరెంటు ఛార్జీలు పెంచబోమని ప్రజలకు ఇచ్చిన మాట తప్పిందని విమర్శించారు. మొదటిదఫాగా రూ.6072 కోట్లు, రెండో దఫాగా రూ.11,820 కోట్లు దాదాపు రూ.18 వేల కోట్లు విద్యుత్ ఛార్జీల భారాన్ని రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపుతోందని విమర్శించారు. దేశ పరువును అంతర్జాతీయంగా దిగజార్చిన అదానీ స్మార్ట్‌మీటర్లను బలవంతంగా రాష్ట్రంలో బిగిస్తున్నారన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. ఎపిఇఆర్‌సి కరెంటు ఛార్జీలపై వినియోగదారుల నుండి అభిప్రాయ సేకరణ చేపట్టిందని తెలిపారు. దీనిపై ప్రజలు, వివిధ సంస్థలు కరెంటు ఛార్జీలను, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ తమ అభ్యంతరాలను తెలుపుతూ విద్యుత్ నియంత్రణ మండలికి మెయిల్స్ ద్వారా ఫిర్యాదులు పంపాలన్నారు. మరోసారి రాష్ట్రంలో ప్రజలు విద్యుత్ ఉద్యమం చేపట్టకముందే కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదానీ స్మార్ట్ మీటర్లకైన ఖర్చును కూడా విద్యుత్ వినియోగదారుల నుండే వసూలు చేయాలని చూసున్నారన్నారు. స్మార్ట్‌మీటర్లు అమలులోకి వస్తే సాధారణ, మధ్యతరగతి ప్రజానీకం చాలా ఇబ్బందులు పడతారన్నారు. భవిష్యత్తులో ప్రజలు సెల్‌ఫోన్ రీఛార్జి చేసుకున్న మాదిరిగానే ముందుగానే కరెంటుకు డబ్బు కట్టి రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వం ఛార్జీల పెంపుపై విమర్శిస్తూ బాదుడే బాదుడు అనే ప్రచార కార్యక్రమం చేపట్టిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే అదే బాదుడే బాదుడు కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కరెంటు ఛార్జీలే కాకుండా ప్రజలు తిరిగే రోడ్లపైనా టోల్ ఛార్జి వసూలు చేస్తామని అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించడాన్ని వారు గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజలు గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వానికి అత్యధిక సీట్లు కట్టబెట్టి అధికారం అప్పగించారని, ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం నడుచుకోవాలని హితవు పలికారు. సదస్సుకు సిపిఐ సీనియర్ నాయకులు బండి వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు. సదస్సులో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జక్రియాను యుటిఎఫ్‌లోకి ఆహ్వానిస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి, యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయుల సమస్యలు పట్టని వారికి మద్దతు తగదు

ఎస్‌టియుకి రాజీనామా చేసిన జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ జక్రియా

పిడిఎఫ్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని ప్రకటన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏనాడూ మాట్లాడని వ్యక్తికి ఎస్‌టియు ఎంఎల్‌సి ఎన్నికల్లో మద్దతు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆ సంఘానికి రాజీనామా చేసినట్లు ఎస్‌టియు జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ జక్రియా ప్రకటించారు. ఈ సందర్భంగా జక్రియాకు ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి యుటిఎఫ్ కండువా కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ జక్రియాకు యుటిఎఫ్ సభ్యత్వం ఇచ్చింది. ఈ సందర్భంగా జక్రియా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై కనీస అవగాహన లేకుండా ఎన్నికల బరిలో నిలిచిన రాజకీయ అవకాశవాదులకు మద్దతుగా పని చేయడం ఇష్టం లేక ఎస్‌టియుకు రాజీనామా చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సమస్యల పట్ల అవగాహనతో, చిత్తశుద్ధితో పని చేసే పిడిఎఫ్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి పాల్గొన్నారు.

నూజివీడులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

సిపిఎం పట్టణ మహాసభ డిమాండ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను తక్షణం పరిష్కరించాలని సిపిఎం పట్టణ ఆరో మహాసభ డిమాండ్ చేసింది. మహాసభ స్థానిక శ్రీ శక్తి భవన్‌లో ఆదివారం జరిగింది. ముఖ్య వక్త సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, అన్ని తరగతుల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతోందని విమర్శించారు. రైతులకు నష్టం కలిగించే వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయాలని చూస్తున్నారని, కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య మత విద్వేషాలు పెంచుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక భారాలు వేయడం తప్ప ఈ కాలంలో చేసిందేమీ లేదని, ధరలు అరికట్టడంలో విఫలమైందని అన్నారు. ఇప్పటికీ ఉచిత ఇసుక అందని ద్రాక్షగానే మిగిలిందన్నారు. పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్ కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టగా ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు జివిఎల్.నరసింహారావు మాట్లాడుతూ రానున్న కాలంలో పట్టణంలో సమస్యలపై ప్రజలను చైతన్యపర్చి పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పనులు పట్టణంలో కూడా చూపాలని, ప్రయివేటు సంస్థల్లో కనీస వేతనాలు అమలు చేయాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ మహాసభలో తీర్మానాలు ఆమోదించారు.

మాట్లాడుతున్న జివిఎల్.నర్సింహరావు

పిల్లల సంబరాలు విజయవంతం చేయాలి

హేలాపురి బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించిన వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాలు విజయవంతం చేయాలని స్టెప్ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు పిలుపునిచ్చారు. సర్ సిఆర్.రెడ్డి డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో బాలోత్సవం పోస్టర్‌ను ఆహ్వాన సంఘం పెద్దలు, వ్యక్తిత్వ వికాస విద్యాలయాల అధిపతులు, టీచర్స్ సమక్షంలో ప్రత్యూష సుబ్బారావు ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు సమన్వయం చేశారు. పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యాలయాల వారు, టీచర్లు పిల్లలను బాలోత్సవానికి సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల సంబరాలు వట్లూరులోని సిద్ధార్థ వెస్ట్ స్కూల్‌లో నిర్వహించడానికి కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు విజిఎంవిఆర్.కృష్ణారావు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ గుడిపాటి నరసింహారావు, సిద్ధార్థ విద్యాలయం ఛైర్మన్ కె.సురేష్‌బాబు, కె.సిద్ధార్థ, అపుస్మ ఏలూరు గౌరవ అధ్యక్షులు శ్రీకాంత్, శర్వాణి, విద్యాసంస్థల డైరెక్టర్ లక్ష్మణ్, ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ విజిఎంవిఆర్ కృష్ణారావు, పిడి రత్నాకరరావు, ఎస్.కస్తూరిరావు, మేతర అజయ్‌బాబు, కె.సోమలానాయక్, పి.కనకదుర్గ, కె.శ్రీనివాసరావు, జి.రాంబాబు, పి.రవీంద్ర, డి.గణేష్ పాల్గొన్నారు.

హేలాపురి బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, వక్తలు

పట్టాభి సీతారామయ్య కృషి చిరస్మరణీయం

అభ్యుదయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.కాళీబాబు, బి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమడోలు

స్వాతంత్ర సమర యోధునిగా, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులుగా డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య దేశాభివృద్ధికి చేసిన కృషి చిరస్మరణీయమని, నేటి తరానికి ఆదర్శప్రాయమని గుండుగొలను గ్రామానికి చెందిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.కాళీబాబు, బి.కోటేశ్వరరావు అన్నారు. పట్టాభి సీతారామయ్య స్వగ్రామమైన గుండుగొలనులో అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఆయన జయంతిని ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి సంఘ కార్యవర్గ సభ్యులతోపాటు గుండుగొలను సొసైటీ మాజీ అధ్యక్షులు వివివి.భాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభ్యుదయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఆంధ్రాబ్యాంక్‌ను స్థాపించిన డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య స్వగ్రామమైన గుండుగొలను గ్రామాన్ని అభివృద్ధి పర్చేందుకు, ఆయన పేర ఒక స్మారక మందిరంతోపాటు అప్పట్లో ఆయన వాడిన వస్తువులతో ఒక మ్యూజియం ఏర్పాటు చేస్తామని అప్పటి ఆంధ్రాబ్యాంక్ ఛైర్మన్ రంగనాథన్ వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఆయన కుటుంబీకులను దీనికోసం ఒక స్థలాన్ని కేటాయించారని తెలిపారు. కాలక్రమంలో ఆ వాగ్దానాలేవీ అమలు కాలేదని, ఆంధ్రాబ్యాంక్ యూనియన్ బ్యాంక్‌లో విలీనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం యూనియన్ బ్యాంక్ స్థానిక శాఖ అధికారులు సైతం బ్యాంక్ ఆవరణలోని సీతారామయ్య విగ్రహానికి పూలమాల వేయకపోవడం శోచనీయమన్నారు. ఆంధ్రాబ్యాంక్ విలీనంతోనే వ్యవస్థాపకుడైన పట్టాభి సీతారామయ్యను అధికారులు మరిచిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇప్పటికైనా కొల్లేరు ముఖద్వారంగా గుర్తింపు పొందిన ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద పున:నిర్మించిన వంతెన వద్ద ఆయన విగ్రహం ఏర్పాటు చేసి వంతెనకు పట్టాభి సీతారామయ్య వారధిగా నామకరణం చేయాలని వారు కోరారు.



విగ్రహానికి పూలమాల వేస్తున్న సంఘ సభ్యులు

ఆస్తి కోసం అయినవారినే కడతేర్చాడు..!

గన్నవరంలో జంట హత్య కేసులో నిందితుడు అరెస్టు

వివరాలు తెలుపుతున్న డిఎస్‌పి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆస్తి కోసం తన సొంత వారినే కడతేర్చిన కిరాతకుడిని కైకలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కైకలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన రొయ్యూరు సుబ్బారావుకు నాంచారమ్మతో మొదటి వివాహమైంది. అనంతరం కొన్ని సంవత్సరాల తర్వాత నాంచారమ్మకు స్వయాన చెల్లెలు అయిన భ్రమరాంబతో రెండో వివాహమైంది. నాంచారమ్మకు కుమారుడు నగేష్‌బాబు ఉన్నాడు. భ్రమరాంబకు కుమారుడు సురేష్ ఉన్నాడు. నగేష్‌బాబు తండ్రి సుబ్బారావు, తల్లి నాంచారమ్మలు మృతి చెందారు. అప్పటి నుంచి ఆస్తి మొత్తం తనకే కావాలని నగేష్‌బాబు పట్టుపట్టాడు. ఆస్తి మొత్తం తనకు చెందకుంటే భ్రమరాంబను, సురేష్‌ను మట్టు పెడతానని పలుమార్లు బాహాటంగానే వారిని బెదిరించాడు. నగేష్‌బాబు తాతయ్య నాగలింగం నుంచి వారికి రావాల్సింది 41 సెంట్లు కాగా తల్లిదండ్రులందరినీ సమానంగా పంచుకోమని చెప్పినప్పటికీ ఏమాత్రం వినకుండ పెడచెవిన పెట్టాడు. సురేష్‌కు గాయత్రితో వివాహమైంది. గాయత్రి తండ్రి మరణించడంతో ఈ నెల 21వ తేదీన గాయత్రి తన ఇద్దరు పిల్లలను తీసుకొని సంవత్సరీకానికి నూజివీడు మండలంలోని తన పుట్టింటికి వెళ్లింది. ఈ సమయంలో గన్నవరం గ్రామంలో సురేష్ అతని తల్లి భ్రమరాంబలు మాత్రమే ఇంటి వద్ద ఉన్నారు. నగేష్‌బాబు ప్రస్తుతం విజయవాడ నగరంలో నివాసం ఉంటున్నాడు. ఇంటి వద్ద ఎవరూ లేరని, తల్లి, కుమారుడు మాత్రమే ఉన్నారని సమాచారం తెలుసుకున్న నగేష్ పక్క పథకం ప్రకారం ఈ నెల 21వ తేదీ తెల్లవారుజామున గన్నవరం గ్రామానికి చేరుకున్నాడు. నిద్రిస్తున్న సురేష్, భ్రమరాంబలపై ఒక్కసారిగా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో తల్లి, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై మండవల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కైకలూరు రూరల్ సిఐ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 48 గంటల్లో నగేష్ బాబును కైకలూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అత్యంత వేగవంతంగా కేసును పరిష్కరించినందుకు జిల్లా ఎస్‌పి వారిని అభినందించారని డిఎస్‌పి తెలిపారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, మండల ఎస్ఐలకు ప్రశంసపత్రాలను అందించారు.

'అపార్' సమస్యల పరిష్కారానికి హెల్ప్ డెస్కులు

భీమడోలు :అపార్ ఐడెంటిటీ కార్డుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి పాఠశాలల వారీగా హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసినట్లు భీమడోలు విద్యాధికారి భాస్కర్ కుమార్ తెలిపారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సహకారంతో మండలంలో ఇప్పటివరకు 87 శాతం అపార్ కార్డుల నమోదు కార్యక్రమం పూర్తయిందన్నారు. ఇంకా సుమారు 1800 విద్యార్థుల వివరాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. కార్డు నమోదుకు తప్పులు లేని, లేదా సవరణలు చేసిన ఆధార కార్డు అవసరమన్నారు. ఈ మేరకు ఆధార్ కార్డులో వివరాల నమోదుకు జన్మ ధృవీకరణ పత్రం, ఇతర పత్రాలు తప్పనిసరన్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వివరాలను సమర్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల వారీగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సహకారంతో పూర్తిస్థాయిలో పూర్తయిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.

ఆశ్రంలో వైద్య విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పోస్టుగ్రాడ్యుయేషన్ వైద్య రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ సిఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా నరసారావుపేటకు చెందిన డాక్టర్ వరగాని జవహర్ (30) ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్య విద్యను అభ్యసిస్తున్నాడు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ ఆశ్రం ఆసుపత్రి అత్యవసర విభాగంలో విధులకు వచ్చాడు. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ఆయన వాష్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకుని ఎంత సేపటికీ రాలేదు. 8.15 గంటలకు మిగిలిన డాక్టర్లు వెళ్లి చూసేసరికి తలుపు వేసి ఉంది. దీంతో ఆసుపత్రి సిఇఒ డాక్టర్ హనుమంతరావు, ఇతర అధికారులకు తెలియజేసి వెంటనే తలుపులను పగలగొట్టి చూడగా జవహర్ మరణించి ఉన్నాడు. అక్కడ మత్తు ఇంజక్షన్లు చేసుకున్నట్లుగా చిరుంజలు, వాడేసిన ఇంజక్షన్ బాటిల్స్ లభించాయి. వారు జవహర్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం పోలీసులకు తెలిపారు. దీంతో ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సిఐ జి.సత్యనారాయణ, రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. జవహర్ తండ్రి డాక్టర్ విజయసాగర్ కూడా నరసారావుపేటలో పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులుగా ప్రయివేట్ ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. జవహర్ తన తల్లిదండ్రులకు ఒక్కడే సంతానం. జవహర్ మత్తు వైద్యుడిగా చదువుతూ మత్తు ఇంజక్షన్లు తానే చేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో మెడికల్ కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. ఏ కారణం చేత ఆయన ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందో తెలియరాలేదు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆదివారం సాయంత్రం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఫోరెన్సిక్ హెచ్‌ఒడి డాక్టర్ కె.శ్రావ్యరావు పోస్టుమార్టం జరిపి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిపిఎం నేతకు సతీవియోగం

పలువురి సంతాపం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు గజవెల్లి వెంకటేశ్వరరావు సతీమణి సరోజినీ(66) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సరోజినీ మృతదేహాన్ని సిపిఎం అనుబంధ సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి, హెజాలీ మేరీ, సిఐటియు మండల కార్యదర్శి టివిఎస్ఎం.సూరి, సిపిఎం సీనియర్ నాయకులు చాగంటి రాజారావు, ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

విద్యుత్ ఛార్జీల పెంపు తగదు

ప్రజాశక్తి - నిడమర్రు

ట్రూ అప్ పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సమావేశం మండలంలోని భువనపల్లిలో గవర సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారపల్లి రమణారావు మాట్లాడుతూ అవినీతి ఊబిలో కూరుకుపోయిన గౌతమి అదానితో గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల మూలంగా ప్రజాపై రూ.వేల కోట్ల భారం పడుతుందన్నారు. ఆ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోట శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, కంచ వరప్రసాద్, కానూరు రాజు, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

వైసిపి రాష్ట్ర సెక్రటరీ జెట్టి గురునాథం

ప్రజాశక్తి - చింతలపూడి

కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని వైసిపి రాష్ట్ర సెక్రటరీ జెట్టి గురునాథం అన్నారు. చింతలపూడి వచ్చిన ఆయన ఎఎంసి మాజీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు నివాసం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కలిసి రాష్ట్ర సెక్రటరీగా నియమితులైనందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ అందరూ కష్టపడి పనిచేసి 2029లో వైసిపిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఆయనను కలిసినవారిలో ఎంపిపి రాంబాబు, పార్టీ మండల ప్రెసిడెంట్ జానకిరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ కొప్పుల నాగు మిర్యాల దిలీప్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షునిగా గిరికుమార్

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎవిగిన కొద్ది ఒదిగి ఉండాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండం సత్యనారాయణ మూర్తి, యువజన సంఘం అధ్యక్షులు పసుమర్తి రాము అన్నారు. మండలంలోని మక్కినవారిగూడెం సమీపంలో ఆదివారం అర్యవైశ్య జగ్గారావు తోటలో కార్తీక వనసమారాధన కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా అడ్డంకి గిరికుమార్, కార్యదర్శిగా కొనకళ్ల శ్రీను, కోశాధికారిగా వంటిపల్లి సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గిరి మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రధానంగా ఆర్యవైశ్య మహిళలు ఎవ్వరి నుంచో కలలు కంటున్న వాసవి క్లబ్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఎం.సోమరాజు, కార్యదర్శి అడ్డంకి రవి, సంఘ సభ్యులు మాదాశెట్టి మల్లయ్య, అడ్డంకి రామకృష్ణ, మండం ఆదిత్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని వట్లూరు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన అజయ్‌రామ్ (29) గుర్తుతెలియని రైలు బండిలో ప్రయాణిస్తూ ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వే గేట్ సమీపంలో రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో అతను ఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ సైమన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఒక మహిళ మెడలో బంగారు గొలుసును ఆగంతకుడు అపహరించి పరారయ్యాడు. నూజివీడు పట్టణానికి చెందిన ప్రశాంతలక్ష్మి ఆదివారం అమ్మవారి తోటలో చర్చికి వెళ్తుండగా ఒక ఆగంతకుడు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించి పరారయ్యాడు. ఆ బంగారు గొలుసు మూడు కాసులని బాధిత మహిళ వాపోయింది. పట్టణంలోని న్యూ ఎంప్లాయిస్ కాలనీకి చెందిన కూరగాయల వ్యాపారి వెంకటేశ్వరరావు భార్య శేషుకుమారి మెడలోని బంగారు గొలుసును ఒక ఆగంతకుడు చోరీ చేసేందుకు యత్నించాడు. శేషుకుమారి ఆమె వద్ద ఉన్న పూజసామగ్రి బుట్టతో అతడిని ఎదిరించింది. దీంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు. ఆరు కాసుల గొలుసు నాంతడు తెగిపోయిందని మహిళ తెలిపింది.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ కె.శుభశేఖర్ తన సిబ్బందితో మండల పరిధిలోని కనసానపల్లిలో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురి మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,100 నగదును, పది వాహనాలను, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో కోడిపందేలు, పేకాట వంటి ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా 112కుగాని, ఆగిరిపల్లి ఎస్ఐ 9440796444 గాని సమాచారం అందించాలని చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రజాశక్తి
ప్రజల పక్షం - ప్రగతి పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆక్రమణలు తొలగించినా తీరని ట్రాఫిక్ సమస్య

వంతెన నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం

నారాయణపురం బజారులో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం - గణపవరం ఆర్అండ్‌బి రహదారి నారాయణపురం బజారు వెంబడి ఆక్రమణలను యుద్ధ ప్రాతిపదికన అధికార యంత్రాంగం తొలగించినా ట్రాఫిక్ కష్టాలు మాత్రం తీరలేదు. జాతీయ రహదారి నుంచి భీమవరం వెళ్లే ప్రధాన రహదారి నారాయణపురం మీదుగా వెళ్తుంది. దీనికి తోడు బజారుకు ఇరువైపులా ఆక్రమణలు వల్లే ట్రాఫిక్ తరచూ స్తంభించి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఐదేళ్ల ఆక్రమణలను భారీ పోలీసు బందోబస్తు నడుమ తొలగించారు. అయినా ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికొచ్చిందని వాహనదారులు వాపోతున్నారు. ఏలూరు కాలువపై బ్రిటీష్ కాలం నాటి వంతెన మీదుగా నిడమర్రు మండలానికి తాగునీటి సరఫరా చేసే పైపు మార్గం ఉండటం, రోడ్డు ఇరుకు అవడం, సింగిల్ లైన్ వాహనాలు వెళ్లడం వల్ల ట్రాఫిక్ ఏర్పడుతోందని ఆక్రమణలు వల్ల కాదని నారాయణపురం ఎంపిటిసి సభ్యులు బండారు నాగవెంకటసత్యనారాయణ అన్నారు. శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణంతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామస్తులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి రూ.8.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

26న ప్రజాధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈ నెల 26వ తేదీన ఏలూరులో కలెక్టరేట్ వద్ద జరిగే ప్రజాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆ కల్లోయిన రాంబాబు, జిల్లా నాయకులు మొడియం నాగమణి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, కార్మిక హక్కులు కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలని, భవన నిర్మాణ హమాలీ ఆటో రవాణా రంగం తదితర అసంఘటిత కార్మికులకు సమగ్ర సామాజిక సంక్షేమం అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరుతూ 26న జరిగే కలెక్టరేట్ ధర్నాకు పెద్దఎత్తున కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల దుర్గారావు, సిహెచ్.సత్యనారాయణ, సిహెచ్.మరిడియ, ప్రమార్తులు, ఎస్.శివకుమార్, పి.తమ్మారావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 26న ఏలూరు కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కైకరంలో రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు. లౌకిక తత్వానికి హాని కలిగిస్తూ కార్పొరేట్లను పెంచి పోషిస్తుందన్నారు. నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో భారీ ఎత్తున రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు ఇతర ప్రజా సంఘాలు సమీకృతమై ప్రజా ఉద్యమాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరిక నోటీసు కలెక్టర్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం పెట్టడంతో పాటు నాణ్యమైన సౌకర్యం కూడా కల్పించాలని ఎపి రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి వి.వి.ఎన్.మస్తానయ్య అన్నారు. ముసునూరు బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. చక్కటి వాతావరణంలో మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. పాఠశాలకు కావాల్సిన వసతులు గురించి ప్రిన్సిపల్ కొండబత్తుల ప్రవీణను అడిగి తెలుసుకున్నారు. కాంపౌండ్‌వాల్, స్కూల్‌లో మౌలిక సదుపాయాలు గురించి వివరాలను ఆయన తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు టీ షర్టులు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నియోజకవర్గంలోని ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులకు అడవినెక్కలం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న చాట్రగడ్డ సుధాకర్ రూ.20 వేలు విలువైన 30 టీ షర్టులు, 30 క్యాప్‌లు, 30 విజిల్స్ బహుమతిగా అందించారు. పట్టణంలోని ఎన్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గ క్రీడా కాంప్లెక్స్ ఇన్‌ఛార్జి పి.రవీంద్ర మాట్లాడుతూ నూజివీడు సబ్ జోన్ ఒక యూనిట్‌గా ఉండాలని కోరారు. సుధాకర్ కబడ్డీలో మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతులు సాధించారని తెలిపారు. నూజివీడు సబ్ జోన్ సెక్రటరీ సుగుణరావు మాట్లాడుతూ సుధాకర్ ఎప్పుడూ సేవా కార్యక్రమాలు చేసేవారని, ఏ జోన్‌లో పనిచేసినా అక్కడ పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులకు ఏదో ఒకటి ఇచ్చేవారని చెప్పారు. సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ హర్ష మాట్లాడుతూ సుధాకర్ తనకు మంచి స్నేహితుడని, కబడ్డీ ఆటపట్ల అంకిత భావంతో ఉండేవారని, వ్యాయామ ఉపాధ్యాయులకు టీ షర్ట్స్ అందించడం సంతోషదాయకమన్నారు. సుధాకర్ మాట్లాడుతూ తాను ఎక్కడ పనిచేసినా వ్యాయామ ఉపాధ్యాయులకు తన వంతుగా ఏదో ఒకటి చేస్తానని తెలిపారు.

25 మంది రక్తదానం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పెదవేగి మండలం జానంపేట దగ్గరలోని జాస్తి బాలగంగాధరరావు తోటలో ఆదివారం కమ్మ సంఘం కార్తీక వన సమారాధన సందర్భంగా రెడ్ క్రాస్ ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 25 మంది రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు.

'అభయ'పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న టీమ్ ఎస్ఐ క్రాంతిప్రియ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అభయపై అవగాహన కల్పించాలంటే కాదేది అనర్హం ప్రదేశమని అభయ టీమ్ ఎస్ఐ క్రాంతిప్రియ నిరూపించారు. ఆదివారం కావడంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో అభయ టీమ్ ఇన్‌ఛార్జి ఎస్ఐ క్రాంతిప్రియ తన టీమ్‌తో కలిసి నగరాన్ని చుట్టేశారు. ఇందులో భాగంగా ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలైన పార్కుల్లో నేరుగా అవగాహన కార్యక్రమాలను ఆక్కడికక్కడే ఏర్పాటు చేశారు. ఏలూరు నగరంలోని ఆర్ఆర్.పేట పార్కులో ఆటవిడుపు కోసం వచ్చిన తల్లిదండ్రులకు అభయపై అవగాహన కల్పించారు. గుడ్, బ్యాడ్ టచ్ అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ క్రాంతిప్రియ మాట్లాడుతూ అభయ టీమ్ పబ్లిక్ ప్రదేశాల్లో, రైల్వేస్టేషన్లో, బస్టాండులో, పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ మహిళలపై వేధింపులు పాల్పడుతున్నవారిని అదుపులోకి తీసుకుంటారని తెలిపారు. అభయకు ఫిర్యాదు చేసిన పది నిమిషాల్లో ఆ ప్రాంతానికి చేరుకుని వారికి సహాయం అందించేలా పూర్తిస్థాయిలో నెట్‌వర్కింగ్ సిస్టం అందుబాటులో ఉందని ఆమె తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే అభయకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలని, లేకపోతే 112 నెంబర్‌కు ఫోన్ చేసిన పది నిమిషాల్లో సహాయం అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభయ టీమ్‌తో పాటు స్థానిక ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

భాష్యం అధినేతకు చిత్రాన్ని బహూకరించిన రేఖాంబిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

భాష్యం అధినేత రామకృష్ణకు చేతితో గీసిన ఆయన చిత్రపటాన్ని టి.నరసాపురం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని మండం రేఖాంబిక బహూకరించినట్లు విద్యార్థి తండ్రి మండం ఆదిత్య కుమార్ ఆదివారం తెలిపారు. టి.నరసాపురం గ్రామానికి చెందిన మండం ఆదిత్యకుమార్, పుష్ప మాధవి దంపతుల కుమార్తె రేఖాంబిక చింతలపూడి భాష్యం పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తమకులో భాష్యం ఫౌండర్ రామకృష్ణ విద్యార్థులతో సమావేశం నిర్వహించారని, పదో తరగతి ఉత్తీర్ణత, అభ్యాసన వంటి విషయాలపై చర్చించారని, అనంతరం రామకృష్ణ చిత్రం చేతితో గీసి ఉన్న చిత్ర పటాన్ని రేఖాంబిక స్వయంగా ఆయనకు బహుకరించారని తెలిపారు.

పాఠశాలను పునఃప్రారంభించాలని ర్యాలీ

నిరసన తెలుపుతున్న గిరిజన సంక్షేమ పరిషత్ నాయకులు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని స్థానిక బాలుర గిరిజన ఆశ్రమం పాఠశాలను తిరిగి మళ్లీ ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని స్థానిక గిరిజన సంక్షేమ పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న కొయిదా కాచారంలో ఉన్న బాలుర ఆశ్రమ పాఠశాల 2022లో గోదావరి వరదలు వచ్చినప్పుడు బుట్టాయగూడెం మండలం లంకపాకలు స్కూల్‌కి తరలించారన్నారు. ఈ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల మండలంలో లేనందువలన చాలా బాధాకరమన్నారు. ఇక్కడ ఉన్న గిరిజన విద్యార్థులు చాలా మంది ఆ స్కూల్‌కి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. లంకపాకలు సరైన రవాణా సదుపాయం లేక ఇబ్బందిగా ఉంటుందన్నారు. బాలుర నిరక్షరాస్యత పెరుగుతుందన్నారు. ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చొరవ తీసుకోవాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాల మండలంలోనే పునఃప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ పరిషత్ నాయకులు, ప్రధాన కార్యదర్శి బంధం ప్రసాద్, గిరిజన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అడ్వైజర్ సైదా రమేష్, మండల కన్వీనర్ కుడియం శివరాజ్, విద్యార్థి విభాగం నాయకులు వెంకట్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని సామాజిక తరగతులు ఆర్థికాభివృద్ధి చెందాలి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సమాజంలో అన్ని సామాజిక తరగతుల ఆర్థికాభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శ్రీ భద్రావతి సమేత భావన వస్తువులమై వెల్ఫేర్ అసోసియేషన్ వారి కార్తీక వనసమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమ సమాజంలో అన్ని తరగతుల ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని, జరిగినప్పుడే సమాజం ఎంతో మెరుగుపడుతుందని, దేశం ఆర్థిక అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. అన్ని రకాల సామాజిక తరగతుల వారు ఒకరినొకరు సహాయం చేసుకోవాలని సోదర భావంతో కలిసి మెలిసి ఉంటే ఆరోగ్యకర సమ సమాజాన్ని స్థాపించవచ్చన్నారు. సామాజికంగా ఆర్థికంగా ఎదగాలంటే ప్రతిఒక్క విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నారు. రాజకీయంగా ఎదగాలన్నారు. పద్మశాలి కులదైవం ఆలయ నిర్మాణానికి, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు. అనంతరం అండర్-13 నెట్ పోటీల్లో గత ఏడాది నుంచి జాతీయ అవార్డు సాధిస్తున్న కె.భావన్‌కు మంత్రి సన్మానించి రూ.1లక్ష ఆర్థిక సహాయం అందించారు. అనంతరం మంత్రిని పద్మశాలి నాయకులు, పెద్దలు ఘనంగా సన్మానించారు.

ముదినేపల్లి : మండలంలోని వడాలిలో ఆదివారం పద్మశాలీల వన సమారాధన నిర్వహించారు. ఈ వన సమారాధన కార్యక్రమంలో సర్పంచ్ మదిరి వెంకటేశ్వరరావు (బ్రహ్మం), మార్కొండ మాధవరావు, గురువు సుబ్రహ్మణ్యం, పందిరి అప్పన్న, ఇమ్మంది శ్రీను, గ్రామ ప్రముఖులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భీమడోలు :ఆర్యవైశ్య యువత ఆర్యవైశ్యుల సంక్షేమంతో పాటు, దేశాభివృద్ధిలో సైతం భాగస్వాములు కావాలని, దీని కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పలువురు వక్తలు కోరారు. ఆంజనేయ నగరం శివాలయంలోని కొబ్బరితోటలో ఆదివారం భీమడోలుకు చెందిన ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భీమడోలుతో పాటు పాతూరు, సూరప్పగూడెం, పోలసానిపల్లి, వంగిపూడెం, అంబారుపేట గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య మహిళ, యువత పాల్గొన్నారు. తొలుత ఆర్యవైశ్యులు తమ ఇష్ట దైవం వాసవిమాతతో పాటు ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఇదే క్రమంలో విద్యార్థులు, యువత, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి

టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సంక్రాంతి నాటికి నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు పూర్తవుతాయనిటిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ ఎన్నో ఎత్తుపల్లాలు చూసిందని, పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పేదల కోసం అంకిత భావంతో పని చేస్తున్న పార్టీ టిడిపి అని అన్నారు. 42 ఏళ్లలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి అణగారిన తరగతుల ప్రజలను రాజకీయ భవిష్యత్తుకు పునాది వేసిన పార్టీ టిడిపి అన్నారు. టిడిపి ఆరంభం నుంచి ఆ పార్టీలో ఉంటూ పార్టీతో పాటుగా ఆ ఎత్తుపల్లాలను చూశానన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన టిడిపి కోసం సామాజిక సేవలో రాజకీయ ప్రయాణం సాగించానన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకైనా ఎత్తుపల్లాలు తప్పవన్నారు. రాజకీయ పార్టీలు సిద్ధాంతాల ప్రకారమే నడుచుకోవాలన్నారు. టిడిపి ప్రారంభించి దాదాపు 42 ఏళ్లు అవుతోందన్నారు. ఇంతకాలం ప్రజాసేవలోనే ఉన్నానన్నారు. 1995లో ఎంపిటిసిగా పోటీ చేసి ఎంపిపిగా ఎన్నికయ్యానన్నారు. 2001-2006లో జెడ్‌పిటిసిగా తమ కుటుంబం నుంచి తన తమ్ముడు వీరమల్లు సత్యనారాయణ భార్య రత్నకుమారి పోటీ చేసి గెలుపొందించాన్నారు. ఆరుసార్లు టిడిపి ముదినేపల్లి మండలాధ్యక్షులుగా, టిడిపి జిల్లా కమిటీలో పలు కీలక పదవులను చేపట్టానన్నారు. గుడివాడ, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో టిడిపి పరిశీలకులుగా పని చేశానన్నారు. మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ తర్వాత కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి బిసిలో సామాజిక తరగతికి ఇవ్వాలని ప్రతిపాదన వచ్చిందన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, కొల్లు రవీంద్ర, గన్ని వీరాంజనేయులుతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కైకలూరు నియోజకవర్గంలో టిడిపి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఇంటింటా ప్రచారం నిర్వహించామన్నారు. ఆ సమయంలో చంద్రబాబు అరెస్టు కావడంతో 53 రోజుల పాటు నిరసన వ్యక్తం చేశామన్నారు. టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బాధ్యతలు అప్పగించారన్నారు. కూటమి పొత్తులో భాగంగా కైకలూరు నియోజకవర్గం బిజెపికి కేటాయించారన్నారు. సంక్రాంతి నాటికి నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు పూర్తవుతాయని తెలిపారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి పద్మశాలి బజార్‌లోని రావిచెట్టు నుంచి జెడ్‌పి స్కూల్ వరకు రూ.3.75 లక్షల నిధులతో నిర్మించే కాంక్రీట్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. 15 ఏళ్లుగా డ్రెయినేజీ సౌకర్యం లేక ఈ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినందుకు పద్మశాలి బజార్ ప్రజలు వీరమల్లు నరసింహారావుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మదిరి దుర్గశ్రీహనుమంత, గురువు సుబ్రహ్మణ్యం, పందిరి శ్రీను, మాధవరావు, ఇమ్మంది శ్రీను, పందిరి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తల సంక్షేమమే టిడిపి లక్ష్యం'

ప్రజాశక్తి - కలిదిండి

కార్యకర్తల సంక్షేమానికి టిడిపి పెద్ద పీట వేస్తోందని అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో కార్యకర్తలతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సభ్యత్వం పొందిన ప్రతిఒక్కరికీ రూ.ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. ఎస్‌సి సెల్ మండల ఉపాధ్యక్షులు బళ్ల రాజు, తిరుమాని గోపాలకృష్ణ, మోకా రాంబాబు, నల్లమోతు వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి నాగరాజు, పెద్దిరాజు, బొడ్డు వెంకటేశ్వరరావు, అండ్రాజు సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదుపై అవగాహన

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రామపంచాయతీ పరిధిలో ఎస్‌సి, బిసి, ఒసి ఏరియాల్లో ప్రధాన కూడలి సెంటర్ వద్ద కార్యకర్తలకు టిడిపి సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పిస్తూ నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేశారు. ఇప్పటికే సుమారు వెయ్యి మందికి సభ్యత్వ నమోదు కాగా, ఇంకా రెండు వేల మందికి పైగా చేయించటానికి సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు పాకనటి సీతారామాంజనేయులు, గార్లపాటి నరసింహారావు, నల్లిబోయిన రాంబాబు, చింతా రాంబాబు, గోగం కాసులు, వేల్పూరి శ్రీను, దేవినేని సాంబయ్య పాల్గొన్నారు.

ఫిబ్రవరి 6 నుంచి ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు తెలిపారు. స్థానిక స్ఫూర్తి భవనంలో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ పాలకవర్గ విధానాల వల్ల దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై ఈ మహాసభలో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కో-కన్వీనర్ తొర్లపాటి రాజు, కురెళ్ల వరప్రసాద్, బంధం నాగేశ్వరరావు, తాళ్లూరి నాగరాజు, కంగల గంగరాజు పాల్గొన్నారు.

పెదవాగు ప్రాజెక్టును బాగు చేయాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

వంటకుకు సాగు నీరందక పెద వాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రాజెక్టు బాగు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్.రామ్ కోరారు. మండలంలోని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా పార్టీ సమావేశం జిల్లా నాయకులు సిరికొండ రామారావు అధ్యక్షతన ఆదివారం రెడ్డిగూడెంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్.రామ్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు ప్రభుత్వాలు కలిసి పెదవాగు ప్రాజెక్టు కట్ట గండి శాశ్వత ప్రాతపదికన, పకడ్బందీగా నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బాసినేని సత్యనారాయణ, గద్దల ముత్యాలరావు, కట్టం వీరాస్వామి, ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ నాయకురాలు ఎస్‌కె.మున్ని, ఎం.కన్నయ్య పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం-వేమూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరిగే షష్టి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వచ్చే నెల ఆరో తేదీ నుంచి 19 వరకు జరిగే ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దేవస్థానం ఆవరణ, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. ఆలయం పుట్ట వద్ద నాగప్రతిమలు వద్ద భక్తుల రద్దీ నియంత్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభం రోజున 50 వేల మంది, మిగతా రోజుల్లో 25 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు.